

మూర్తిని పిలిచాడు, ఓ గుమాస్తా — "భాయీసాబ్!" అని, దగ్గరకు రమ్మని చేతులు ఊపుతూ. అతని దగ్గరికి వెళ్ళాడు, ఏమి చెబుతాడో అని.

ఆఫీసరు చాలా స్ట్రిక్టయిన మనిషనీ, మదరాసీ అగుట వలన మర్యాదలూ అవీ ఎక్కువగా చూస్తాడనీ, ఇంటర్వ్యూలు ఎప్పుడు పడితే అప్పుడు ఈయడనీ ఏవేవో చెప్పా డతను. అన్నింటికీ "ఊఁ" కొట్టాడు మూర్తి ఆఫీసును, పరిశుభ్రతను పరికిస్తూ.

ఇంతలో ఆఫీసరు బయటకు వచ్చాడు. అందరూ కంగారుగా లేచి నిలబడ్డారు.

"కమాన్, మిస్టర్ మూర్తి!" అని మరుక్షణంలోనే లోనికి పోయాడు ఆయన.

"వీడు కూడామదరాసీయే కాబోలు!" అని నాలుక కరుచుకొన్నా డా గుమాస్తా, ఆఫీసరు గదిలోనికి పోతూన్న మూర్తిని చూస్తూ.

అంతవరకు ఏ ఆఫీసరు గదినీ చూడని మూర్తి వింతగానూ, ఆశ్చర్యంగానూ చూస్తూ ఆయన కెదురుగా నిలుచున్నాడు.

"టేక్ యువర్ సీట్!" ఎదురుగా ఉన్న కుర్చీ చూపించా రాయన. ఎలాగో కూర్చున్నాడు మూర్తి బితుకుబితుకుగా.

"ఆఁ! మీ రెక్కడుంటున్నారు?" స్ప్రింగ్ ఛెయిర్‌కు ఓ పుష్ ఇచ్చి విలాసంగా చూస్తూ అడిగారు ఆయన.

"సార్! మీ రెవరో అనుకొని అసభ్యంగా ప్రవర్తించా క్షమించాలి, సార్!" లేచి నిలబడ్డాడు మూర్తి, వణుకుతూన్న కాళ్ళను నిలదొక్కుకొంటూ. నిజానికి అతను అసభ్యంగా ప్రవర్తించకపోయినా, అలా అనిపించింది అతనికి ఆయన అంతస్తు చూశాక.

"నో నో నో! నాట్ ఎటాల్!" అన్నారు ఆయన, అభయం ఇస్తూన్న దైవంలా చూసి,కూర్చోమన్నట్లు చెయ్యి ఆడిస్తూ. మరల కూర్చున్నాడు మూర్తి.

గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. వెంటనే రిస్టు వాచీ చూసుకొని, కాలింగ్ బెల్ స్విచ్ నొక్కాడు ఆఫీసర్. వెంటనే గుమాస్తా లోనికి వచ్చాడు భయం భయంగా నక్కుతూ.

"గడియారం పది నిమిషాలు స్లోగా నడుస్తోంది. రేపు వాచ్ రిపేరర్‌కు చూపించండి!" ఆంగ్లంలో ఆజ్ఞ జారీ చేశాడు.

"ఎస్, సార్!" అంటూ బయటకు నడిచాడు ఆ గుమాస్తా.

"రండి! మా రూమ్‌లోకి పోదాం!" అంటూ బయటకు నడిచా రాయన. మంత్రముగ్ధుడులా ఆయనను అనుసరించాడు మూర్తి.



శకుంతల

ఫోటో — జి. లక్ష్మీనారాయణ (బొంబాయి–6)

సలాం చేసి, రూమ్ తలుపు తీశాడు అక్కడున్న క్లాస్ ఫోర్. ఆ గది కూడా ఆఫీసులోనిదే. ఓ కాంప్ కాట్, మూడు కుర్చీలు, రెండు లెదర్ కేసులూ వగైరాలు ఉన్నాయి.

"తమరు ఫామిలీతో లేరా, సార్?" గదిని కలియచూస్తూ అడిగాడు మూర్తి.

"ఈ రోజు శనివారం కదా? మీల్సా, టిఫినా?" అడిగా డాయన, అతని ప్రశ్నకు జబాబీయకుండా.

"మీల్సు తీసుకోను, సార్! అయినా, నే వెళ్ళాలి, సార్! చాలా దూరం నా క్వార్టరు."

"ఫామిలీ లేదా?"

"లేదు, సార్! వివాహం ఇంకా కాలేదు."

"మరి ఇక్కడనే టిఫిన్ చేసెయ్యండి." మూర్తి ఏదో చెబుతున్నా వినిపించుకోకుండా ఇద్దరికీ టిఫిన్ తెమ్మని ఆజ్ఞాపించా డాయన. పది నిమిషాల్లో సుకారొట్టెలు తెచ్చి పెట్టాడు క్లాస్ ఫోర్.

ఇద్దరూ టిఫిన్ ప్రారంభించారు. ఒకరి విషయాలు ఒకరు ఊరూ, పేరూ, కులం, గోత్రం—అన్నీ వివరంగా తెలుసుకున్నారు. రావుగారిది రామచంద్రపురం తాలూకాలోని పెదపర్తి గ్రామం. అతనికి ఇద్దరబ్బాయిలు. అత్తవారి ఊరు కాకినాడ. అతనికి ఆ మధ్యనే గౌహతి నుంచి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆంధ్రా స్టేటుకు ట్రై చేస్తే వారణాసి వేశారు. ఆఫీసు రూమ్‌లో ఉండటానికి ఇష్టంలేదు. ఎంత వేగంగా ఇల్లు దొరికితే, అంత వేగంగా ఫామిలీని తీసుకుని రావాలని చూస్తున్నారు. సరయిన ఇల్లు దొరకలేదు. మూర్తిది కూడా అదే జిల్లా, అమలాపురం తాలూకాలోని పుల్లేటికుర్రు. తండ్రి గతించడంతో అతని చదువు మెట్రికులేషన్‌తో ఆగిపోయింది. ఐ. టి. ఐ. లో ట్రెయినింగ్ అయాడు. తల్లీ, తమ్ముడూ, పెళ్ళీడు వచ్చిన చెల్లెలూ ఉన్నారు. రైల్వే క్వార్టర్సులో ఉంటున్నాడు. అప్పుసొప్పులు ఏమీ లేవు, ఒక ఇల్లు తప్ప. ఇద్దరూ బ్రాహ్మణులు కావడం ఓ విశేషం. పైగా ఒకే శాఖ.

"మీ గురించి మొదట్లో ఏమో అనుకొన్నా, సార్! ఇప్పుడు తెలిసింది, నా ఊహ పొరపాటని!"

"ఏమనుకొన్నారు?" మంచినీళ్ళు త్రాగుతూ అడిగారు.

"అహఁ ఏమీ లేదు, సార్! తమరు పెద్ద ఆఫీసర్ కదా? ఆ పాటి రిజర్వ్‌డ్‌నెస్ ఉండాలి, సార్!"

"ఓ అదా! చిన్నప్పటినుంచీ అందరితోనూ అంత చొరవగా మసలడం అలవాటు లేదు. అయినా, అలవాటు చేసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాను" అంటూ ప్లేట్లో చేతులు కడుక్కొన్నారు రావుగారు.

మూర్తి బయటకు వెళ్ళి వరండాలో చేతులు కడుక్కొని లోనికి వచ్చేసరికి, రావుగారు రేడియో ట్యూన్ చేస్తున్నారు. ఇంగ్లీషు వార్తలు వస్తున్నాయి.

"థాంక్యూ, సార్! చాలా ఆలస్యం అయింది. మరి నాకు సెల విప్పించండి."

"అప్పుడప్పుడు కనబడుతూ ఉండండి" అన్నారు పక్కపాడి నోట్లో వేసుకొంటూ.

• • •

ప్రతి ఆదివారం మూర్తి రావుగారిని కలుసుకొంటూ ఉండేవాడు. ఒక్కొక్కప్పుడు మధ్యాహ్నం రావుగారితోబాటే హోటల్లో భోజనం చేసేవాడు, ఆయన బలవంతంమీద.

"ఈ వేళ కన్నయ్యా చిత్ర మందిర్‌లో తెలుగు సినిమా ఉంది, సార్, ఉదయం పది గంటలకు."

"మరోసారి చూద్దాం లెండి" అన్నారు రావుగారు అయిష్టంగా.

"తెలుగు సినిమా, సార్! ఒకే షో!"

"నాకు తెలుగు పిక్చర్సు మీద అంత లైకింగ్ లేదండి."

మరేమీ అనలేకపోయాడు మూర్తి.

"యూ కెన్ గో! ఐ హావ్ ది లీస్ట్ అబ్జెక్షన్."

"మీరు కూడా వస్తారేమోనని రెండు టికెట్సు తెచ్చాను, సార్" అన్నాడు జేబులోని టికెట్లు బయటకు తీస్తూ.

"ఏవీ—చూడనీయండి!" అంటూ వాటిని తన చేతిలోకి తీసుకొన్నాడు.

"ఛారిటీ షోవా?"

"అవును, సార్! ఇక్కడ ఆంధ్రా కల్చరల్ ఎస్సోసియేషన్ ఉంది, సార్! ఇది బెనిఫిట్ షో, సార్! దాని మీద డొనేషన్ అని మాత్రమే ఉంటుంది. టాక్సెస్ ఏమీ ఉండవు! ఆంధ్రులు అందరూ డొనేట్ చేయాల్సి సార్!"

ఇంకా ఏమేమో చెప్పబోతూన్న మూర్తి ఆయన మొహం సుముఖంగా ఉన్నట్లు కనబడనందున ఆగిపోయాడు.

రావుగారు పర్సు నుండి పది రూపాయలు తీసి, "ఈ టిక్కెట్లు ఖరీదు తీసుకోండి" అన్నారు.

"ఖరీదు కాదు, సార్! డొనేషన్. అదే సబ్‌స్క్రిప్షన్ లాంటిది."

"అందుకే ఇస్తున్నా, తీసుకోండి! ఏమీ అనుకోకండి రానందుకు." చేయి ముందుకు చాచారు పది రూపాయల నోటుతో.

డబ్బు తీసుకోవడానికి తటపటాయిస్తూ అన్నాడు.

"అయిదు రూపాయలు ఈయండి, సార్, చాలు!"

"ఫరవాలేదు. తీసుకోండి రెండింటి ఖరీదూ! ఐ మీన్ డొనేషన్! ఊఁ, తీసుకోండి!"

ఏమీ అనలేక తీసుకొని జేబులో ఉంచుకొన్నాడు.

"టైమవుతోంది, వెళ్ళండి!" అన్నారు చేతి వాచీ చూస్తూ.

"వస్తా, సార్! సెలవు!" అంటూ బయటపడ్డాడు మూర్తి.

మూర్తి మనసు చాలా బాధపడింది. 'తెలుగు వాడు కాబట్టి తప్పకుండా వస్తాడని అనుకొన్నాడు. ఆ ధైర్యంతోనే అడక్కుండా రెండు టిక్కెట్లు తీసుకొన్నాడు. ఆ సిటీకి తెలుగు పిక్చర్సు రావడమే అరుదు. ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తా రంతా! పాత సినిమా అయినా, చూసినదే అయినా, తప్పకుండా వస్తారు అంతా. కొంతమంది ఇతర భాషల వారు కూడా రావడం కద్దు. భాష తెలియకపోయినా భావాలు తెలుస్తాయి కదా? ఎంత బ్రతిమాలినా రావన్నాడు. ఆఫీసరు కదూ—డెలికసీ ఫీలయ్యాడేమో? పెద్ద పెద్ద ఆఫీసర్లు కుటుంబాలతో సహా వస్తారని తెలియదు కాబోలు. మరెప్పుడూ సినిమా విషయం ఆయన వద్ద ఎత్తకూడదు' అనుకున్నాడు.

* * *

ఆ రోజు మూర్తి వెళ్ళేసరికి రావుగారు మరో పెద్ద మనిషితో మాట్లాడుతున్నారు. ఆయన కూడా పెద్ద ఆఫీసరు లాగానే ఉన్నాడు, వేష భాషలు చూస్తే. ఇద్దరూ ఇంగ్లీషులోనే మాట్లాడు కుంటున్నారు. మూర్తి గుమ్మం దగ్గరనే ఆగిపోవడం చూసి, "కమిన్, మిస్టర్ మూర్తీ" అన్నారు రావుగారు. ఉన్నవి మూడే కుర్చీలు. రెండు కుర్చీల్లో వారిద్దరూ కూర్చున్నారు. మూడో కుర్చీలో వారు త్రాగిన చాయ్ గ్లాసులూ, సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె ఉన్నాయి. లోనికి పోయిన మూర్తి రావుగారి కుర్చీ వెనకగా నిలబడ్డాడు. రావుగారికి అభిముఖంగా కూర్చున్న అవతల వ్యక్తి మూర్తివైపు అదోలా చూశాడు. న్యూనతాభావం! సుపీరియారిటీ కాంప్లెక్సు! మూర్తి ప్రాణం రవ్వారవ్వా చచ్చిపోయింది. వారిద్దర్గూ ఏవేవో మాట్లాడుకొంటున్నారు, రాజకీయాలు, ఇంగ్లీషులో.

"ఐ యామ్‌సారీ, మిస్టర్ మూర్తి!" అంటూ ఖాళీ కుర్చీని ముందుకు లాగారు రావుగారు, ఖాళీ చేయాలనే ఉద్దేశ్యంతో.

"ఫరవాలేదు, సార్! నేను తీస్తా!" అంటూ ఖాళీ గ్లాసులు క్రింద పెట్టి, అగ్గిపెట్టె, సిగరెట్టు పెట్టె రావుగారికి అందించి కూర్చున్నాడు మూర్తి.

"హి ఈజ్ మిస్టర్ మూర్తి! మెకానిక్ ఇన్ డీజెల్ లోకోమోటివ్స్."

"నమస్కారం, సార్!" వినయంగా చేతులు జోడించాడు మూర్తి.

నమస్కారం అందుకొన్నట్లు తల మీద నుంచి క్రిందకు ఊపారు.

"మీట్ మిస్టర్ ఎమ్. రంగారావ్, సూపరింటెండెంట్, టెలిగ్రాఫ్సు, వారణాసి."

ఆశ్చర్యపోయాడు మూర్తి.

"నో నో నో! ఐ యామ్ రిలీవ్డ్ ఆన్ ట్రాన్స్‌ఫర్ టు బెజ్వాడా."


"అదృష్టవంతులు, సార్!" నవ్వు మొహం పెట్టుకొని అన్నాడు మూర్తి.


ఇంతలో ఓ జీపు వచ్చి ఆగింది. అందరూ జీపు వైపు చూశారు. ఓ ఏభై ఏళ్ళ వ్యక్తి దిగాడు. తెల్లని లుంగీ, తెల్లని స్లాక్ అచ్చం టినోపాల్ ఏజెంటులా ఉన్నాడు. అచ్చం మదరాసీలా ఉన్నాడు. అతన్ని చూడగానే ఇద్దరూ లేచి నిలబడ్డారు. మూర్తికి కూడా లేవక తప్పింది కాదు.

"ఉయార్ రెడీ, సార్!" అన్నారు రావుగారు, ఆయనకు ఎదురుగా వెళుతూ. ముగ్గురూ బయట నిలబడ్డారు. అందరూ ఎక్కడికో వెళుతున్నట్లు గమనించాడు మూర్తి. వారి కంటె తనే ముందుగా జారుకుంటే మర్యాదగా ఉంటుం దనుకున్నాడు. ఇంతలో రావుగారు వెనక్కి వచ్చారు రూమ్‌లోకి ఆదరా బాదరాగా.

"చూడండీ, మూర్తిగారూ, ఈ వేళ మంచి మలయాళం పిక్చరుందట! గోవిందనాయర్ రమ్మంటున్నాడు. మరలా కలుద్దాం!" ఆయన కంగారుగా చెప్పుకుపోతూంటే, మూర్తి గది అవతలకు పోయి నిలబడ్డాడు, ఆయనకి గదికి తాళం వేసుకొనేందుకు వీలుగా.

"అలాగే, సార్!" అంటూ బయటకు నడిచాడు మూర్తి. మూర్తి మెయిన్ గేటు దాటకుండానే ఆఫీసర్ల జీపు వెళ్ళి






పోయింది. తానెంతో కష్టపడి ఓ ఇల్లు చూశాడు. ఆ విషయం రావు గారితో చెప్పాలనుకొన్నాడు. అవకాశం దొరికితేనా? మెల్లగా నడక సాగించాడు. టైము పదిన్నర దాటింది. ఎండ తీక్షణంగా ఉంది. ఏం చేయాలి? క్వార్టరుకు పోతే తోచదు. బేల్‌పురాలో ఉంటున్న ప్రకాశ రావు గారి ఇంటికి వెళ్ళాలనుకొన్నాడు, ఆయన్ను కలిసి చాలా రోజులయింది కనక. విశ్వేశ్వరగంజ్ జంక్షన్‌లో శంకరం కనిపించడంతో ప్రాణం లేచి వచ్చింది మూర్తికి. హడావిడిగా పోతున్నట్లు గమనించాడు. గట్టిగా కేకవేశాడు.

మూర్తిని చూసిన శంకరం ఆనందంతో కావలించుకొన్నాడు, నడిరోడ్డు మీదనే (అక్కడ అలా కావలించుకోవడం కొత్త కాదు కాబట్టి ఎవ్వరూ పట్టించుకోరు ).

"ఎప్పుడు వచ్చేశావు దేశం నుంచి?"

"నిన్ననే వచ్చా! మీ అమ్మా, తమ్ముడూ, చెల్లెలూ అంతా బాగున్నారు. సెలవు లివ్వాక మా తమ్ముడు మీ తమ్ముడితో కలిసి మీ ఇంటికి వెళ్ళి వారం రోజుల క్రితమే వచ్చాడు. ఆ విషయం చెప్పమన్నాడు."

సంతోషంతో తబ్బిబ్బయిపోయాడు మూర్తి. తానే స్వయంగా చూసినట్లనిపించింది అతనికి. మూర్తిని తన ఇంటికి లాక్కొని పోయాడు శంకరం. భోజనం చేయడానికి మొదట తటపటాయించాడు మూర్తి. ఆవకాయా, గోంగూర పచ్చడీ వగైరాలు చూశాక మొహమాటం ఎగిరిపోయింది.

"రేపు పెళ్ళయి వదిన వస్తే మేము కూడా మీ ఇంటికి భోజనానికి వస్తామనా ఆలోచిస్తున్నారు అన్నయ్యగారు!" నిష్ఠూరంగానూ, వేళాకోళంగానూ అంది శంకరం భార్య పార్వతి.

"తప్పకుండా రండి! అప్పుడు మీరు వస్తారో రారో కానీ, ఇయిందు మీ ఇంట్లో చాలా సార్లు భోజనం చేసేస్తున్నా!"

"ప్రమోషను వచ్చి, పెద్ద ఉద్యోగంలోకి వెళితే మమ్మల్ని మరిచేపోతారు."

"ఇప్పుడప్పుడే నాకేం ప్రమోషను రాదులెండి! ఆ భయం మీ కేమీ అక్కరలేదు. మీరు చెప్పినట్లుగా ప్రమోషనుగాని వస్తే గిస్తే, పెద్ద ఆఫీసరు అయితే సాటి సోదరులను ఆదరించి గౌరవించడం మరిచిపోతే అదేమీ వింత విషయం కాదు లెండి!"

"అదేమిటోయ్ కొత్తగా మాట్లాడుతున్నావు?" ఆశ్చర్యపోయాడు శంకరం.

"అది అంతేనోయ్! నీ వేమీ ప్రభుత్వోద్యోగివి కాదు. ఉద్యోగుల మధ్య మసలే దౌర్భాగ్యం నీకు లేదు. వినోదం కోసం, విలాసం కోసం లేదా తీర్థయాత్రల కోసం, చేతినిండా డబ్బు పట్టుకొని, విచ్చలవిడిగా ఖర్చు చేసే వారితో మసిలే నీకు అలాంటి విషయాలు తెలియవు. చెప్పినా అర్థం కావు."

"ఈ రోజు ఏదో విచిత్రంగా మాట్లాడుతున్నారు అన్నయ్యగారు!" పార్వతికూడా అంది.

టాపిక్ మార్చేయాలనుకున్నాడు మూర్తి. "అది సరే కానీ, ఈ ఊళ్ళోనా కొక ఆఫీసరుతో పరిచయం అయింది. సాయంత్రం వెళదాం. వస్తావా?"

ఆలోచిస్తూ ఉండిపోయాడు శంకరం.

"ఏమి టాలోచిస్తున్నావు?"

"అహఁ! ఏమీ లేదు! రేపు యాత్రాస్పెషలు ఒకటి వస్తోంది. ఏర్పాట్లన్నీ నన్నే దగ్గరుండి చూడమన్నారు పండిట్‌జీ" అని ఆగి మరలా అన్నాడు శంకరం: "సరే, వస్తాలే! కానీ, నన్ను త్వరగా పంపించెయ్యాలి."

"నే పంపించే దేమిటి! నీవే వచ్చేస్తావు."

"అదేమిటండోయ్ అలా అంటున్నారు. ఊరూ పేరూ కనుక్కొని, సరే ఇక పొండి, అంటాడా ఆ ఆఫీసరు!" నవ్వును ఆపుకుంటూ అడిగింది పార్వతి.

"నీకు వేళాకోళం ఎక్కువగా ఉంది!" మందలించాడు భార్యను, శంకరం.

"నిజంగా నీకు అర్జెంటు పనంటూ ఉంటే మే మాగమంటే మాత్రం ఆగుతావా? అందుకనే అలాగన్నా!"

నవ్వుకొన్నారు దంపతు లిద్దరూ.

"తేనె లొలుకు తెలుగు మాట కోసం పరితపిస్తూన్న మనం, మరో తెలుగువాని మొహం కోసం మొహం వాచిన మనం, మరొకడు కనిపిస్తే, అందులోనూ ఈ సిటీలోనే ఉంటున్న వాడు కనిపిస్తే అమాంతం ఎగిరి గంతేస్తాం కానీ, నీవు చెప్పినట్లు నిలువునా నిలబెట్టి నాలుగు ప్రశ్నలు వేసి, సరే పొండి అంటామా?ఏమోయ్, మూర్తీ?"

వెంటనే మూర్తి ఏమీ అనలేదు, మంచినీళ్ళు తాగుతున్నాడు కనక.

"అదేమీ లేదు, చెల్లెమ్మా! మంచివారే! కాకపోతే ఆఫీసరు—మనమే జంకుతాం చనువుగా మాట్లాడ్డానికి." సర్ది చెప్పాడు ఇద్దరికీ.

"నమస్కారం, సార్! ఇతని పేరు శంకరం! మా ఊరువాడే. ఇక్కడనే ఉంటున్నాడు." లోనికి ప్రవేశిస్తూ శంకరాన్ని చూపించాడు మూర్తి. రావు గారు తన వైపు చూస్తూంటే నమస్కరించాడు శంకరం.

"అవును, సార్! ఇక్కడనే రామ్‌కుమార్జీగారి దగ్గరుంటున్నా" అన్నాడు.

"అంటే పండాగారా?"

అతని మాట ఈసడింపుగా ఉన్నట్లు తోచింది శంకరానికి. మొహం పెద్దగా చిన్నబుచ్చుకోలేదు. చూపుల్ని కిందికి మరల్చాడు ఆయన మొహం చూడలేక.

"దట్సాల్ రైట్. కూర్చోండి."

కుర్చీలు చూపించారు. ఇద్దరూ కూర్చున్నారు. కొంతసేపు మౌనం. రావుగారు 'రీడర్స్ డైజెస్ట్' తీయబోతూండగా అన్నాడు మూర్తి: "ఉదయం తమతో చెప్పాలని వచ్చాను, సార్! తమరు చాలా బిజీగా ఉన్నారు. అందుకని. . ."

సగంలోనే ఆగిపోయాడు.

"ఏ విషయం?" పుస్తకాన్ని మంచం మీద పడేశారు.

"బేల్‌పురాలో ఓ ఇల్లు ఉంది. మొన్న మనవాడే ఖాళీ చేశాడు. నిన్న వెళ్ళి చూశా. ఇస్తామన్నారు."

"వెరీ మెనీ థాంక్స్, మిస్టర్ మూర్తీ! హౌ మచ్ రెంట్? ఎకామడేషను ఎంత? లొకాలిటీ మంచిదేనా?"

"అంతా బాగానే ఉంది, సార్! అద్దె ఇదివరకు తొంభై ఇచ్చేవారు. ఇప్పుడు వంద అడుగుతున్నారు."

"దెన్, ఇట్ మస్ట్ బి ఎ స్మాల్ పోర్షన్."

"లేదు, సార్! రెండు గదులూ, ఒక వంటిల్లూనూ."

"ఇట్సాల్‌రైట్ ఫర్ ది టైమ్ బీయింగ్! పే అడ్వాన్స్ అండ్ కనఫర్మ్ ఇట్" అంటూ తలగడ కింద ఉన్న పర్సు తీశారు. అందులో ఉన్న పదకొండు వంద రూపాయల నోట్లను బయటకు తీసి రెండు సార్లు లెక్క పెట్టి, అయిదు నోట్లు మూర్తికి అందించారు.

"అయిదు వందలు ఎందుకు, సార్?"


"దె మే డిమాండ్ ఫోర్ ఆర్ ఫైవ్ మంత్స్ అడ్వాన్స్."

"అక్కరలేదు, సార్! వాళ్ళు రెండు నెలలు అడ్వాన్సు చాలన్నారు." మూడు నోట్లు తిరిగి ఇచ్చేశాడు.

"అదీ ఒకందుకు మంచిదే! ఆఫ్టర్ టూ మంత్స్ ఇఫే బెటర్ వన్ ఈజ్ సెక్యూర్డ్ ఉయ్ కెన్ షిఫ్ట్!"

"మీరుకూడా ఓ సారి వచ్చి చూస్తే బాగుంటుంది, సార్!"

"డోన్ట్ వర్రీ. ఆ ఎకామడేషను




ఎలాగూ చాలదు. ఐ హోప్ టు సెర్వ్ ఫరెవెటర్ వన్. మీరు ఎడ్వాన్సు పే చెయ్యండి! టుమారో అయామ్ గోయింగ్ ఆన్ కాంప్ టు గోరఖ్‌పూర్. ఐ షెల్ బి బేక్ ఇన్ కపుల్ ఆఫ్ డేస్. యూ సింప్లీ ఫోన్ టు మీ. యూ నీడ్ నాట్ కమ్."

"అలానే, సార్! మరి మేం వస్తాం" అంటూ లేచాడు మూర్తి. శంకరం కూడా లేచాడు-"సెలవు, సార్"అంటూ.

ఇద్దరూ బయటకు వచ్చేశారు. కొంతసేపు మౌనం.

"ఇతనితో పరిచయం పెంచుకోవడం ఏమిటో నా కంతగా ఇష్టం లేదోయ్!" మొట్టమొదటిసారిగా మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు శంకరం.

"ఏం? అలా అంటున్నావు? మనవాడే కదా!"

"అందుకే అలా అంటున్నా. అతని మాటల ధోరణి చూస్తే అచ్చం తెలుగు వానిలాగే కనిపిస్తున్నాడు" అంటూ హేళనగా నవ్వాడు శంకరం.

"అతని మాటలు నీకు కొత్త. అందుకనే అలా అనిపిస్తోంది!"

"తెలుగువాని అంతరం అతి వేగంగా అవగాహన చేసుకోగలననే నా నమ్మకం. కారణం, రకరకాల మనస్తత్వాలు గల వారితో మసలుతూ ఉంటాన్నేను. ఈ వేళ చూసిన వాణ్ణి రేపు చూడను. అంటే, అంతమందితో మసలుతూ వారి వారి భాషాలను ఇట్టే పసిగడతాను. తదనుగుణంగా నడుస్తూ ఉంటాను."

"ఒకరి మనస్తత్త్వం తెలుసుకోవాలంటే అతనితో కనీసం నాలుగు రోజులయినా తిరగాలి. నీవు చాలా మందితో కలిసి తిరుగుతూంటావు. నేను కాదనను. కానీ, ఎవరితోనూ ఓ రోజు కన్నా ఎక్కువ కాలం గడపవు."

"అంత కాలం అక్కర్లేదోయ్! ఒక్క అరగంట చాలు. అతనితో మాట్లాడుతూ అతన్ని బాగా చదివి, ఇట్టే పసిగట్టేయ గలను— వా డెలాంటి వాడో, ఎలాంటి భావాలు గలవాడో!"

"నేను నీతో వాదించలేనోయ్!" అన్నాడు మూర్తి, అతని గురించి ఇంకా వ్యాఖ్యానించడానికి ఇష్టం లేక.

"అది సరే. మీది ప్రాతఃకాల పరిచయమా? లేక సాయంకాలపు స్నేహమా?"

"అంటే?" అర్థం కాలేదు మూర్తికి.

"అదే! నీ కతనితో ప్రథమ పరిచయం ఉదయం పూటా? లేక సాయంసమయం లోనా?"

"ఓ అదా! అర్థం అయింది. మేము సాయంసమయంలోనే కలుసుకున్నాం" అన్నాడు నవ్వుతూ.

"అయితే మంచిదే! అందులోనూ ఆఫీసరుకూడాను. ముందు ముందుకు మంచిది. నీ కో తమ్ముడూ, నా కో తమ్ముడూ ఉన్నారు ఉద్యోగాల కోసం!"

"ఆ అభిప్రాయంతో అతనితో పరిచయం చేసుకోలేదు. అసలు మొదట్లో అతను ఆఫీసరనే నాకు తెలియదు!"

"సరే. నే వస్తానోయ్. ఆ ఇంటి సంగతేమిటో చూడు! నీ మీదనే పెట్టాడు! అనక కుదరలేదంటే బాధ పడతాడు" అంటూ వెనక్కి తిరిగాడు శంకరం.

* * *

డ్యూటీలో ఉండగా మధ్యాహ్నం రెండు గంటలకు ఫోను వచ్చింది మూర్తికి. రావుగారు అర్జెంటుగా సాయంత్రం కలుసుకోమన్నారు. డ్యూటీఅయిన వెంటనే రావుగారి వద్దకు వెళ్ళాడు. రావుగా రింకా ఆఫీసులోనే ఉన్నారు. మూర్తిని చూడగానే, చూస్తున్న ఫైలును పక్కకు పెట్టి, "అలా బయటకు వెళదాం, రండి" అంటూ రూమ్ బయటకు వచ్చేశారు రావుగారు. ఆయనను అనుసరించాడు మూర్తి. రావుగారు మౌనంగా నడుస్తూ మెయిన్ రోడ్డులోని కూల్‌డ్రింక్స్ షాపులోకి నడిచారు. ఒకరి కొకరు అభిముఖంగా కూర్చున్నారు.

లస్సీలకు ఆర్డరిచ్చారు రావుగారు.

ఎందుకు పిలిచారో తెలియక తికమక పడుతూన్న మూర్తి అడిగాడు, ఆలస్యం భరించలేక! "ఎందుకో పిలిచారు?"

"అదేనండి, చెబుతా! ఈ నెల పదహారో తేది మంచిది. ఫామిలీని తీసుకు రావడానికి" అని ఆగారు ఆయన.

"అమ్మగారు వస్తున్నా రన్న మాట! చాలా సంతోషం, సార్!" అన్నాడు. కానీ, తన నెందుకు రమ్మన్నారో అర్థం కాలేదు.

"నాకు సరిగా పధ్నాలుగు నుండీ ఢిల్లీలో కాన్ఫరెన్సు ఉంది. ఇరవై వరకూ అక్కడనే ఉండాలి" అని మళ్ళీ ఆగారు ఆయన. అప్పుడే బేరర్ తెచ్చిన లస్సీ గ్లాసును మూర్తికి ముందుగా తోశారు. తన చేతిలోకి గ్లాసు తీసుకొని ఓ పీల్పు పీల్చి మరలా చెప్పడం మొదలు పెట్టారు.

"యూ ప్లీజ్ హెల్ప్ మీ!" అన్నారు.

'అయితే, నన్ను గాని వెళ్ళి తీసుకొని రమ్మంటారా! సెలవు లేదు. సిక్ చేయాలి. జీతం నష్టం వస్తుంది! ఎలా?' ఏమి అనాలో తెలియదు. లస్సీని పీల్చడంలో నిమగ్నుడైనట్టుగా ఏమీ అనలేదు మూర్తి.

"మీ బ్రదర్ కిప్పుడు సెలవులే అనుకుంటా!"

"అవును, సార్!"

"మీ బ్రదర్ని ఎస్కార్ట్‌గా ఫాలో అవమని ఉత్తరం రాయగలరా?"

"అలాగే, సార్! దాని కేముంది! వాడూ ఖాళీగానే ఉన్నాడు." తేలికపడిన మనస్సుతో అన్నాడు.

"వెరీ మెనీ థాంక్స్! పదహారో తేదీ మంచిది. ఆ రోజుకి ప్రయాణం ఏర్పాటు చేసుకోమని మీ తమ్ముణ్ణి మా వాళ్ళ ఇంటికి వెళ్ళమనండి. అడ్రెస్సు రాసి ఇస్తా. ఈ వేళ అప్పుడే రెండో తారీఖు! మీరూ ఈ రోజే ఉత్తరం రాయండి! వాటీజ్ యువర్ బ్రదర్స్ నేమ్?"

"రవి అండి. పుల్లేటికుర్రు."

ఇద్దరూ లేచారు.

* * *

"రండి! రండి! నిన్న మధ్యాహ్నం మీకు ఫోను చేద్దామనుకున్నా! ఎలాగూ ఈ రోజు వస్తారు గదా అని ఊరుకొన్నా" అన్నారు రావుగారు, వస్తూన్న మూర్తిని చూసి

"ఏమిటి, సార్, విశేషం?" కుర్చీని దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు మూర్తి.

"రేపు హౌరా ఎక్స్‌ప్రెస్‌లో మన వాళ్ళు వస్తున్నారు—నిన్న మధ్యాహ్నమే టెలిగ్రామ్ వచ్చింది." రావుగారి కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నాయి.

"అయితే, మనం మొఘల్‌సరాయ్ వెళ్ళి కలిస్తే బాగుంటుంది, సార్! సామానుతో వస్తున్నారు కాబట్టి!"

"ఆ ట్రెయిను బనారస్‌కి ఉదయం తొమ్మిది గంటలకు వస్తుందట!"

"అవును, సార్—తెల్లవారుఝామున అయిదు గంటలకు మొఘల్‌సరాయ్ వెళ్ళడానికి ఓ పాసింజర్ ఉంది. దానిలో మనం వెళ్ళచ్చు!"

"అయితే, రాత్రికి ఇక్కడనే ఉండిపొండి. ఉదయమే జీప్‌లో పోదాం!"

"అలా వద్దు, సార్! మీరు ఉదయమే

ప్షనుకి రండి. నేనూ వస్తా!"

మరేమీ మొహమాట పెట్టలేదు రావుగారు.

"ఈ వేళ మంచి ఇంగ్లీషు పిక్చరు ఒకటి వచ్చింది, వెళదామా?"

"అసలు ముఖ్యమయిన విషయం మరిచిపోయాం సార్. సినిమాకు మరోసారి పోవచ్చు! మన మా ఇంటికి పోయి శుభ్రం చేయించే ఏర్పాట్లు చేయాలి."

"అవునండోయ్! మరిచిపోయా! మీల్సు తీసుకొని పోదాం" అంటూ లేచారు రావుగారు.

ఇల్లు ఏమంత పెద్ద పోర్షను గాదన్నీ ఇబ్బందిగా ఉంటుందనీ అన్నారు. మరో ఇంటి కోసం చూసుకోవాలని కూడా అన్నారు. ఆయన పెద్ద ఆఫీసరు కాబట్టి ఆయన హోదాకు అది సరిపడదేమో నని సరిపెట్టుకొని ఊరుకున్నాడు మూర్తి.

* * *

ఆ రోజు ఆదివారం. మంచి ఎండలో మరో ముగ్గురిని వెంట బెట్టుకొని వెళ్ళాడు మూర్తి, రావుగారి ఇంటికి.

"రండి. రండి! మంచి ఎండలో బయలుదేరారు!" అంటూ లోనికి ఆహ్వానించారు మూర్తిగారు, అపరిచిత వ్యక్తుల వైపు చూస్తూ. రావుగారు చూపించిన సోఫాల్లో కూర్చున్నా రంతా.

వీరంతా ఎవరు? అనే ప్రశ్న రావుగారి మొహంలో కొట్ట వస్తున్నట్లు కనబడు తూంది.

మూర్తి చెప్పడం మొదలుపెట్టాడు.

"మన సిటీలో ఆంధ్రా కల్చరల్ ఎసోసియేషను ఒకటి ఉంది. అది బహుశా మీకు తెలిసే ఉండచ్చు. వీరు ఎసోసియేషన్ ప్రెసిడెంటు, లక్ష్మణరావుగారు. యూనివర్సిటీలో రీడర్-ఇన్-లా. వీరు ఈ ఊరిలోనే స్థిరపడిపోయారు. వ్యాపారం చేస్తున్నారు. ట్రెజరర్ పేరు విశ్వనాథంగారు. ఇక వీరు సెక్రటరీ. పేరు సూర్యనారాయణగారు. ఎయిర్ డ్రోమ్‌లో ఉద్యోగం." పరిచయం చేశాడు మూర్తి. అందరూ నమస్కారం చేశారు. ప్రతినమస్కారం చేశారు రావుగారు.

"ఐయామ్ సూపరింటెండెంట్ నేషనల్ శాంపుల్ సర్వే ఆఫ్ ఇండియా." తనను తానే పరిచయం చేసుకున్నారు రావుగారు.

ఇంతలో కూల్‌డ్రింక్స్ పట్టు కొచ్చాడు రవి. తలుపు వారగా నిలబడి వింటూంది శాంతి, వారి మాటలు.

"వచ్చే ఆదివారం మన ఎసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ ఉంది, సార్. ఎలక్షన్సుకూడా ఉన్నాయి. మన సిటీకి మరో తెలుగు కుటుంబం వచ్చిందని మూర్తిగారు చెప్పారు. పరిచయం చేసుకుందామని వచ్చాం. ఆదివారం తప్పకుండా తమరు కుటుంబంతో రావాలి, సార్. . ." అని ఆగారు ప్రెసిడెంటు లక్ష్మణరావుగారు.



నాగపూజకు...

ఫోటో — వి. ఉమామహేశ్వర్ (నందిగామ)

తరవాత ట్రెజరర్ విశ్వనాథంగారు అందుకొన్నారు.

"ఉదయం ఏడు గంటలకు జనరల్ బాడీ మీటవుతుంది. తరవాత ఎలక్షన్సు. తరవాత పది గంటలకు తెలుగు ఫిలిమ్ షో కూడా ఉంది, సార్!"

రావుగారు మౌనంగా వింటూ ఉండిపోయారు.

తరవాత సెక్రటరీ సూర్యనారాయణ గారి వంతయింది.

"ఇక్కడున్న తెలుగు వారంతా కుటుంబంతో వస్తారు, సార్! తప్పకుండా రావాలని మా ప్రార్థన."

"అలాగే. తప్పకుండా వస్తాం" అన్నారు రావుగారు ఎట్టకేలకు.

'హమ్మయ్య' అనుకొన్నాడు, అంత వరకూ ఆయన ముఖ కవళికలను గమనిస్తున్న మూర్తి.

అందరూ సెలవు పుచ్చుకొని పోయారు. వారి వైపే చూస్తున్న రావుగారు, శాంతి పలకరింపుతో పక్కకు తిరిగారు.

"ఏమిటండీ అంతలా బతిమాలించు కున్నారు వారి చేత? అలా అయితే గానీ మీరు పెద్ద ఆఫీసరని వాళ్ళకు తెలియదనా?"

"వస్తానని చెప్పానుగా!"

"ఆఁ అన్నారు! ముగ్గురూ బతిమాలాక!" అంటూ లోనికి పోయింది.

* * *

ఆ రోజు నిషాత్ టాకీస్ ఆంధ్రులతో కిటకిట లాడుతూంది. కొత్తగా వచ్చిన వారితో పరిచయం చేసుకొనేవారు, పాత స్నేహితులను చాలా కాలానికి కలుసు కున్నామనే ఆనందం! పిల్లల కేకలు. ఆడవారి అదిరింపులు. పట్టుచీరల పరపరలు, కన్నెపిల్లల కేరింతలు...కోలాహలంగా ఉంది. రావుగారూ కుటుంబంతో హాజరయారు. రావుగారిని అక్కడి పెద్దలకు పరిచయం చేశాడు మూర్తి. ఏడు గంటలకు అనుకున్న సభ ఎనిమిదిన్నరకు ప్రారంభం అయింది. చాలామంది మాట్లాడారు. రావుగారినికూడా మాట్లాడ మన్నారు. రావుగారికి ఇష్టం లేకపోయినా, అందరూ బలవంతం చేయడంతో మాట్లాడక తప్పింది కాదు. తెలుగులో మాట్లాడడం ఇష్టం లేకనో, లేక అలవాటు లేకనో, లేక రెండూనో మొత్తంమీద ఇంగ్లీషులోనే మాట్లాడారు రావుగారు. వెంటనే సభలో గుసగుసలూ, నిరసనలూ ప్రారంభం ఆయాయి! అదేమీ గమనించనట్లుగానే తన ఉపన్యాసాన్ని ముగించారు. వేదిక దిగుతూంటే ఎవరో అన్న మాట రావుగారికి వినిపించక పోలేదు:

"ఈయనెవడో కొత్తవాడయినా ఉండాలీ, లేకపోతే తెలుగు వాడు కాకపోయి ఉండాలి!"

వెంటనే వేదిక మీదకు పోయి అధ్యక్షునితో ఏదో చెప్పి వెళ్ళిపోయారు.

* * *

"ఏమండీ! మీటింగ్ సగంలోనే వచ్చేశారు?" గుమ్మంలో అడుగు పెడుతూనే ప్రశ్నించింది శాంతి.

చదువుతున్న 'అమృత బజార్' పత్రిక పక్కకు తీసి శాంతి వైపు చూశారు.

ఆమె మొహం ఎర్రబారి కందగడ్డలా ఉంది. పైగా కోపంతో ధుమధుమ లాడుతూంది. మొహం అంతా చెమట పట్టి ఉంది. కుంకుమబొట్టు చెదిరి ఉంది. భుజం మీద బాబు నిద్ర పోతున్నాడు. తల కొద్దిగా రేగింది. ముంగురుల్లు మొహం మీద పడుతున్నాయి. ఆమె అవస్థకు అతనికి జాలి కలిగింది.

చంటివాణ్ణి రవికి ఇస్తే అంత ఇబ్బంది తప్పేది కదా అనుకొన్నాడు.

"మంచి ఎండలో వచ్చారు! వెళ్ళి కూల్‌డ్రింక్స్ తాగండి! తరవాత మాట్లాడుకో వచ్చు!" గుమ్మం లోకి చూస్తూ అన్నారు, రవి ఇంకా రాలేదామా అనుకొంటూ.

భర్త జవాబు కోసం చూస్తున్న శాంతి, అతని కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది, బాబును సోఫామీద పడుకో బెట్టి.

"ముందు నా కీ సంగతి చెప్పండి! సగంలోనే ఎందు కొచ్చేసినట్టు?" నిలదీసింది.

సమాధానం చెప్పలేదు రావుగారు.

"రవి ఏడి? రాలేదా మీతో?" తిరిగి ప్రశ్నించారు.

"ఇంత మంది జీపులో ఎలా పడతాం? మీ జీపు అడిగితే రూల్సు ఒప్పవు! ఆ ఇంజనీరుగారి భార్య, పిల్లలకే వారి జీపు సరిపోలేదు. ఎలాగో తెచ్చి పడేశారు ఇక్కడ!"

పెద్దగా అసంతృప్తినీ, నిరసననూ వ్యక్తం చేసింది. పెద్దవాడు రావ్‌జీ ఇదేమీ పట్టనట్టు 'విజయచిత్ర' పేజీలు తిరగేస్తున్నాడు, ఓ మూలను కూర్చుని.

"మీరు చేసిన పనికి నాకు తల కొట్టేసినట్లు అయింది!"

"ఏం? ఏం చేశానని?"

"ఎప్పుడూ లేని కొత్త సంప్రదాయం ప్రవేశపెట్టారని నలుగురూ నానా రకాలుగా అనుకొన్నారు."

"ఏమిటంటుంది?"

"తెలుగు వాళ్ళందరూ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకుంటే ఇంగ్లీషులో మాట్లాడ్డం నచ్చ లేదు చాలా మందికి. చాలా మంది కేమిటి? దాదాపు అందరికీను. 'ఎవడో కొత్తాయనలా ఉన్నాడు! ఎవరో మరి!' అని అనుకోవడం నేను చెవులారా విన్నాను!"

"పోనీ నీ భర్తను కాదని, ఎవరో తెలియదని చెప్పేయ లేకపోయావా?" అన్నారు నవ్వబోతూ. కానీ, శాంతి పరిస్థితి చూసి నవ్వలేక పోయారు.

"నన్నెవ్వరూ అడగనూ లేదు! నేను చెప్పనూ లేదు!" ఆమెలో సీరియస్‌నెస్ తగ్గ లేదు.

"పోనీ ఇంకేం?"

"పెద్దాఫీసరు కదా అనీ, పైగా కొత్త మెంబరు కదా అని మాట్లాడ మంటే బాగా చేశారు! పైగా సగం లోనే వచ్చేశారు! సినిమా చూడను అని ముందే చెప్పలేకపోయారా?"

"అనుకోకుండా అర్జెంటు పని తగిలింది, శాంతీ! అయినా, మన తెలుగు పిక్చర్సు చూసేదేమిటి? అన్నీ ఒక్కలాగే ఉంటాయి! నా సంగతి నీకు తెలియదూ? తెలుగు పిక్చర్సు అంతగా చూస్తానా?"


"బాగా తెలుసు మీ సంగతి. తెలుగు భాషనీ, తెలుగువారినీ దుయ్యబట్టడమే మీ పని! అక్కడి కేదో మీరు ఆంధ్రులు కానట్టు." కళ్ళనీరు పెట్టుకుంది ఆమె.

"ప్రతిదీ అంత సీరియస్‌గా తీసుకుంటే ఎలా, శాంతీ? ఇంతకీ పిక్చరు ఎలా ఉంది?"

శాంతి మాట్లాడలేదు, కోపం ఏమాత్రం తగ్గకపోవడం వల్ల.

"చాలా బాగుంది, నాన్నగారూ! మంచి మంచి డాన్సులూ, పెద్ద పెద్ద ఫైటింగులూ." అందుకొన్నాడు రావ్‌జీ సంతోషంతో.

"అవునులే. అంతకన్నా ఏముంటాయి మన పిక్చర్సులో!"



శిల్పం (హంపి)

ఫోటో — డాక్టర్ కె. పురుషోత్తం (నెల్లూరు)

ఇంతలో రవి రావడంతో శాంతి ఆ గదినుండి నిష్క్రమించింది. పది రోజుల నుంచీ వారి కుటుంబంతో కలిసి ఉంటున్నాడేమో బాగా చనువు ఏర్పడింది రవికి.

"అదిగో! రవి మామయ్య వస్తున్నాడు" అంటూ ఎదురు వెళ్ళి రవిని వాటేసుకున్నాడు పెద్దవాడు రావ్‌జీ.

"ఏమిటిరా ఆ కౌగిలించుకోవడం? వాడి బట్టలు నలిగిపోవూ!" కోప్పడ్డారు రావుగారు.

"పోనిద్దురూ, బావగారూ, చిన్నవాడు!" అన్నాడు రవి.

'బావగారు' అని సంబోధించి నప్పుడల్లా చీకాకుగా ఉంటుంది రావు గారికి. అయితే, ఆ చీకాకును బయటకు రానీయరు—శాంతికి భయపడే అని చెప్పాలి. ఆమెకు కలుపుగోరుతనం ఎక్కువ.

"రావోయ్, రవీ! ఇంత ఆలస్యం అయిందే?" పలకరించింది శాంతి, బట్టలు మార్చుకొని ఈవలకు వస్తూ.

"అక్కయ్యగారూ! ఇక్కడా గొడవ లున్నాయి సుమండీ" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

"ఏం గొడవలోయ్?" ఆత్రత పడింది ఆమె.

"మన వాళ్ళెక్కడుంటే అక్కడే గొడవలు! ఏమి గొడవలు అని వేరే అడగక్కర లేదు." రావుగారి కామెంట్.

"అబ్బ! మీరు కొంతసేపు ఊరుకొందురూ!"

"ఇక్కడా పార్టీలున్నాయి" అన్నాడు రవి.

"ఎవన్నార్, ఎస్వీ ఆర్ పార్టీలేనా?" అడిగింది శాంతి.

"అవయినా బాగుండును. అంతకన్నా పెద్దవే!"

రావుగారు ఆసక్తిగా వింటున్నారు.

"అంటే!" విపులంగా చెప్పమన్నట్టు చూసింది ఆమె.

"తెలంగాణా, ఆంధ్రా అంటూ ఇక్కడ రెండు పార్టీలు పెట్టుకొన్నారట. వారి చర్యలు వీరికి నచ్చవు! వీరి చేతలు వారికి నచ్చవు."

"ఆ గొడవలన్నీ మన కెందుకు లెస్తూ! రండి, భోజనాలు వడ్డిస్తా! అప్పుడే రెండవుతోంది" అంటూ వంట గదిలోనికి పోయింది, ఆ విషయాలు చర్చించడం ఇష్టంలేక.

"ఎల్లుండి వెళదామనుకుంటున్నా నక్కయ్యగారూ!" భోజనాల దగ్గర అన్నాడు రవి.

"అదేమిటోయ్! అప్పుడే వెళతానంటావు! వచ్చి వారం రోజులేగా అయింది? ఊరంతా చూడద్దూ? వ్యాస కాశీ, యూనివర్సిటీ చూసేస్తే సరా? సారనాథ్ చూశావా? అయినా, నీ వింటి దగ్గర ఇప్పుడు చేయవలసిన రాచకార్యాలేమున్నాయి!" అంటూ భర్త వైపు చూసిందామె, అతన్నికూడా ఓ మాట అనమన్నట్లుగా. అత నేమీ మాట్లాడ లేదు. మౌనంగా ఊరుకున్నాడు.

"ఏం? మీ అన్నయ్య వెళ్ళిపోమంటున్నారా?" అన్నారు కొంతసేపటికి.

శాంతికి చీకాకు వేసింది.

"అదేమీ లేదండి. వెంటనే వచ్చేస్తానని చెప్పా. అమ్మా వాళ్ళు నా కోసం చూస్తుంటారు."

"వచ్చాక ఇంటికి ఉత్తరం రాయ లేదా?" పొడిగా అన్నారు.

"రాశానండి. రేపు అన్నయ్య సారనాథ్ చూపిస్తానన్నాడు."

"సరే, నీ ఇష్టం"! అంటూ లేచి పోయారు రావుగారు.

* * *

"రవి చాలా మంచివాడు సుమండీ!" అంది భర్తకు వక్కపొడి అందిస్తూ ఆ నాటి రాత్రి.

పేపరు చదువుతూన్న రావుగారు ఏమి అనలేదు. వక్కపొడి నోటిలో వేసుకొన్నారు.

"ఈ పదిహేను రోజుల్లోనూ బాగా చనువు అయిపోయాడండి. పిల్లలు వాణ్ణి చూస్తే వదలరు."

"ఊఁ అయితే, ఇక్కడనే ఉండి పోమందామా?"


"మనం ఉండమంటే మాత్రం ఉంటాడా ఏం? బి. ఎ. ఫస్టియర్‌తోనే ఆపేస్తాడట. అతనికి చదవాలనే ఉందట! పి. యు. సి. ఫస్టు క్లాసు వచ్చిందట. వాళ్ళ ఆర్థిక పరిస్థితులు అలాంటివి! ఇంట్లో పెళ్ళీడు పిల్లకూడా ఉందట."

"అయితే!" అన్నారు రావుగారు పేపరులోంచే.

"వాడి కేదైనా ఉద్యోగం వేయించండి!" గోముగా చూస్తూ భర్తకు దగ్గరగా కూర్చుంది.

"ఉద్యోగమా! ఏదైనా పెళ్ళికొడుకును చూడడం అనుకున్నావా?"

నిర్విణ్ణురాలయింది భర్త మాటలకు.




కాని, వెంటనే తేరుకొంది.

"ఆ దిక్కుమాలిన పేపరు ఒక్కసారి పక్కకు పెడుదురూ! ఎలాగైనా ఉద్యోగం వేయించాలండి! చాలా బీద వాళ్ళు! పైగా పెళ్ళీడు చెల్లెలుకూడా ఉంది!" బతిమాలే ధోరణి అవలంబించింది.

"అయితే, అన్నదమ్ము లిద్దరూ నిన్ను పట్టారన్న మాట."

"ఛ వాళ్ళేమీ అడగలేదు! ఎలాగైనా మీతో చెప్పి ఉద్యోగం వేయిస్తానని నేనే మాట ఇచ్చా!"

"అయినా, మీరు ఎంతమందికి ఉద్యోగాలు వేయడం లేదు? అందులోను మనవాడు, పైగా దూరపు బంధువు కూడానూ! తప్పకుండా ఉద్యోగం ఇస్తారనే మీ ఆఫీసుకు అప్లికేషను కూడా పెట్టమన్నా!"

"ఇప్పుడు ఎపాయింట్‌మెంట్సు మన చేతుల్లో లేవు, శాంతీ! అంతా స్ట్రిక్టుగా ఉంటోంది."

శాంతి కోపంతో లేచిపోయింది.

"మీ కన్నీ స్ట్రిక్టే! పోనీ, చూద్దాం అనైనా అన్నారు కాదు! ఊఁ! నా మాటకు ఎప్పుడు విలువ ఇచ్చారు కనక! ఆ గోవిందన్నాయర్ చూడండి! క్రిందటి నెలలో పదకొండు మందికి ఉద్యోగాలు ఇచ్చాడట! అందులో ఆరుగురు కేరళ వాళ్ళే! జాతి అభిమానం అంటే అలా ఉండాలి! మీరూ ఉన్నారు—ఎందుకూ? అంతా స్ట్రిక్టు!" విసురుగా పోయింది.

అలా చూస్తూ ఉండిపోయారు రావుగారు.

వరండాలో నిద్ర పట్టక వారపత్రిక చదువుతూన్న రవి వారి మాటలను స్పష్టంగా విన్నాడు. తన మీదా, తన కుటుంబం మీదా అక్కయ్యగారికున్న అభిమానానికి ఆశ్చర్యపోయాడు రవి. కానీ, బావగారి ఆంతర్యం అర్థం కాలేదు. తన గురించి భార్యా భర్త లిరువురూ మాటా మాటా అనుకోవడమా? ఉద్యోగం వేయిస్తానంటే ఏదో మాటవరస కన్నారు అనుకొన్నాడు. ఇంత పట్టుదలగా ఉంటుం దనుకోలేదు. మరునాడు అన్నయ్యతో చెప్పాడు పూసగ్రుచ్చినట్టుగా.

"నీవు ఉద్యోగం వేయించమని అడిగావా?" అన్నాడు మూర్తి.

"లే దన్నయ్యా. అక్కయ్యగారే అన్నారు—బావగారితో చెప్పి వేయిస్తానని. ఈ వేళ ఉదయం నన్ను పిలిచి గోవిందన్నాయరు ఆఫీసుకి కూడా అప్లికేషను పెట్టమన్నారు, ఎందుకైనా మంచిదని. గోవిందన్నాయర్ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో డ్రిల్లింగ్ ఇంజనీర్! బావగారికీ, అతనికీ మంచి స్నేహం ఉందట. బావగారిచేత చెప్పిస్తానన్నారు."

"గోవిందన్నాయర్‌తో చెప్పి నీకు ఉద్యోగం వేయిస్తాడని నే ననుకోను! ఆ మనిషి తరహాయే వేరు." అసంతృప్తిగా, అనుమానంగా అన్నాడు మూర్తి.

"పోనీ ప్రయత్నం చేద్దాం, అన్నయ్యా! ఓ అప్లికేషన్ పడేస్తే ఏం పోయింది? ఇరవై పైసలు ఆర్డినరీ పోస్టులో పంపేస్తా అప్లికేషన్."

మూర్తి ఏమీ మాట్లాడలేదు, కొంతసేపు.

"రావుగారి సంగతి ఇట్టే పసిగట్టి, ఆ వేళే చెప్పేశాడు సుమా శంకరం! నే నప్పుడు కొట్టిపారేశాను."

"నిజంగా ఖాళీలు లేవేమో, అన్నయ్యా?"

"అలానే అనుకోవాలి మరి" అన్నాడు మూర్తి నిర్లిప్తంగా.

* * *

అన్నదమ్ము లిద్దరూ బాగా పొద్దుపోయాక రావు గారి ఇంటికి వెళ్ళారు.

"రండి, రండి! అన్నదమ్ము లిద్దరూ కలిసే వచ్చారు." ఆహ్వానించింది శాంతి.

రావుగారు శనివారం ఫలహారం చేస్తున్నారు ఇడ్లీ. వెనక్కు తిరిగి చూశారు.

"మూర్తిగారు ఈ మధ్య రావడమే మానేశారు." పలకరింపుగా అన్నారు.

"లేదండి. తమ్ముడితో అటూ ఇటూ తిరుగుతూన్నా. నిన్ననే సారనాథ్ కూడా చూపించాను. తమ్ముడు ప్రతిరోజూ ఇక్కడనే ఉంటున్నాడు కదా!" అంటూ పీటను దగ్గరగా లాక్కొని కూర్చున్నాడు మూర్తి.

రావ్‌జీ పుస్తకం ముందుంచుకొని చదువుకొంటున్నాడు, అటువైపు వెళ్ళాడు రవి. రావ్‌జీని దగ్గరుండి చదివించడం వల్ల మాంచి ప్రోగ్రెస్ కనిపించింది. అక్కడ తెలుగు స్కూలు లేదు. ఏం చేయాలా అని ఆలోచిస్తున్నారు. ప్రస్తుతాని కొక ట్యూషను ఎరేంజి చేశారు.

పద్యం చదవసాగాడు రావ్‌జీ.

"తెలుగ దేలయన్న దేశంబు తెలుగేను
దెలుగు వల్లభుండ దెలు కొకండ
యెల్ల నృపులు గొలువ నెడుగవే బాసాడి
దేశ భాషలందు దెలుగు లెస్స!"

ఆ పద్యం వినగానే "శివశివా!" అని చెవులు మూసుకున్నాడు రవి.

"దేశభాషలందు దెలుగు లెస్స కాదు, బాబూ! లెస్స! లెస్స! లెస్స. ఏదీ అను—లెస్స! లెస్స!"

"ఉహూఁ నే నను! ప్రైవేటు మాస్టారలాగే రాసి ఇచ్చారు! లేకపోతే తన్నుతారు!" అంటూ మారాం చేశాడు రావ్‌జీ.

"ఏదీ చూడనీ!" అంటూ పుస్తకాన్ని తీసి చూశాడు.

"లెస్స అనే రాసి ఉంది, బాబూ! కలిపి రాయడం వల్ల నీకలా కనిపిస్తోంది. ఆ మాట నాకు చెవులకు ములుకుల వలె గుచ్చుకొంటోంది. లెస్సు అన్న మాట ఇంగ్లీషు పదం, బాబూ! అది విపరీతార్థం ఇస్తుంది. దాన్ని తెలుగు జాతి భరించలేదు. ఆ అర్థానికి ఆత్మహత్య చేసుకోవాలి."

రవి మాటలు రావ్‌జీకి అర్థం కాలేదు.

"అవును, రవీ! ఇందాకటినుంచీ అలానే చదువుతున్నాడు సుమీ! మేమెవరమూ పట్టించుకోలేదు. ఎంతైనా వాళ్ళ నాన్నగారి అబ్బాయి కదూ? ఇంగ్లీషు మాట జొప్పించాడు!" భర్త వైపు కొంటెగా చూసింది, ఏడిపించినట్టుగా.

"శాంతీ! ఏమిటా వేళాకోళం? సమయం, సందర్భం ఉండక్కర్లే?" కోపగించుకున్నారు రావుగారు.

వారిని అంతటితో ఆపు చేయాలనే ఉద్దేశ్యంతో మాట మార్చాడు మూర్తి.

"అమ్మకి ఒంట్లో బాగుండటం లేదుటండీ! రవిని పంపమని ఉత్తరం వచ్చింది. రేపు పంపించా లనుకొంటున్నా. ఆ విషయం మీతో చెప్పాలని వచ్చా!"

"అలాగా!" అన్నారు రావుగారు.

"అయ్యో, పాపం!" అంది శాంతి.

ఏభై రూపాయలు తెచ్చి రవి చేతిలో పెట్టారు రావుగారు. డబ్బు తీసుకోవడానికి సంకోచించాడు రవి. అన్నయ్య వైపు చూశాడు, డబ్బు తీసుకొని.

"అంత డబ్బు అక్కరలేదండి! పి. టి. ఒ. తీసుకొన్నా! ఇరవై చాలు" అన్నాడు మూర్తి.

"నీవు పి. టి. ఒ. తిన్నావా, పాసు

తియ్యా అతన్ని మేము తీసుకొచ్చాం. ఇంటివరకూ అయ్యే ఖర్చులు భరించవలసింది మేము'' అన్నారు రావుగారు.

డబ్బు జేబులో ఉంచేసుకొన్నాడు రవి, మరి ఏమీ మాట్లాడకుండా.

''అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూ ఉండు, రవీ!'' అంది శాంతి, స్వంత తమ్ముడు వెడుతున్నట్లుగా అనిపించి. కనుమరుగయే వరకూ గుమ్మంలో నిలబడింది.

* * *

జీప్ దిగి గబగబా గదిలో ప్రవేశించారు రావుగారు. పక్క గదిలో శాంతి ఎవరితోనో మాట్లాడుతూంది తెలుగులో.

''ఇంత ఎండలో ఎవరొచ్చారబ్బా!'' అనుకొంటూ కిటికీలోంచి చూశారు టై విప్పుకొంటూ. మూర్తి, శాంతి ఇద్దరూ బాతాఖానీ కొడుతున్నారు. బ్రీఫుకేసుని ముడిచి టైని టేబిలు మీదకు విసిరారు. వాళ్ళ మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

''బాగా ఎండెక్కి పోయింది. భోజనం చేసి వెళ్ళండన్నయ్యగారూ!''

''మీ ఇంటికోసం వెతకడంతోనే చాలా పొద్దెక్కింది. బెంగాలీ తోలా అని రావుగారు చెప్పారు. కానీ, ఇది కైలాసపురా లొకాలిటీ లోనిదే. దీని తరవాతి గల్లీ నుంచి బంగాలీ తోలా అంటారు. అడ్రెస్సు సరిగా తెలియక గంటన్నర పట్టింది మీ ఇల్లు కనుక్కొందుకు!''

''ఈ ఇంట్లోకి మార్చి పది రోజులే అయింది. నాకేం తెలియదు మా ఇంటి అడ్రెస్సు!''

''ఎలా ఉందండీ ఈ ఇల్లు?''

''బాగానే ఉంది! కానీ, అద్దె ఎక్కువ! మాట ఏభై రూపాయలు! రండి, ఇల్లు చూద్దురుగాని, మీ బావగారు కూడా వచ్చారు'' అంటూ లేచింది శాంతి.

రావుగారు సోఫాలో కూర్చొని 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ' చూస్తున్నారు.

నమస్కారం చేశాడు మూర్తి.

''ఎంతసేపయింది, సార్, వచ్చి!''

చీకాకుగా ఉన్నా, సభ్యతకు కట్టుపడక తప్పింది కాదు రావుగారికి.

''రండి, కూర్చోండి! ఇప్పుడే వచ్చా! ఏమిటి విశేషాలు?''

''అలా కుర్చీలో కూర్చోండన్నయ్యగారూ!'' అంటూ రావుగారి కెదురుగా కుర్చీ వేసింది శాంతి.

''మాట్లాడుతూ ఉండండి, ఇప్పుడే వస్తా!'' లోనికి పోయింది.

వా రిద్దరూ ఏమీ మాట్లాడలేదు. మరలా వీక్లీ చూడ్డం మొదలెట్టారు. మూర్తి గదినంతనీ పరికించాడు. అందమైన, ఖరీదైన ఫర్నిచర్. ఫోనూ, ఫానూ, గాడ్రెజ్ అల్మైరాలూ— గది చాలా అందంగా, హుందాగా ఉంది రావుగారిలా. దూరంగా టేబిలు మీదున్న 'విజయచిత్ర' తీసుకొని తానూ బొమ్మలు చూడడం ప్రారంభించాడు.

''అదేమిటీ! మాటా మంతీ లేకుండా కూర్చున్నా రిద్దరూ?'' అంటూ రెండు కూల్ డ్రింక్స్‌తో ప్రవేశించింది శాంతి.

వెంటనే ఇద్దరూ తమ తమ పుస్తకాలని పక్కకు పెట్టారు. శాంతి అందించిన డ్రింక్సు అందుకొన్నారు.

''చూడండీ! భోజనం చేసి వెళ్ళమంటే చేయనంటున్నారు!'' అంది భర్త వైపు చూస్తూ. మీరు కూడా ఉండమని చెప్పండి అనే భావం వ్యక్తం చేసింది.

''మూర్తిగారికి మనమేం కొత్తకాదు. తప్పకుండా ఉంటారు'' అన్నారు, ఖాళీ సీసా శాంతి కందిస్తూ ఓ చిరునవ్వు నవ్వి. తెచ్చి పెట్టుకున్న నవ్వులా కనిపించింది ఆమెకు.

''అవునండీ! నిజం చెప్పారు! నాకేమీ మొహమాటం లేదు'' అన్నాడు మూర్తి.

శాంతి ఇక మాట్లాడలేక పోయింది.

''మరి నే వస్తా, సార్!'' అంటూ లేచాడు. చూపులతోనే వీడ్కోలు ఇచ్చారు రావుగారు. వీధి గుమ్మం వరకూ వెళ్ళి తిరిగి వచ్చింది శాంతి.

''మీ పద్ధతి నా కేమీ నచ్చలేదు!'' అంది భర్త కళ్ళలోకి చూస్తూ.

''అంటే?''

''అతనితో మాట్లాడే పద్ధతి ఇదేనా? పాపం! ఎరుగున్న వాళ్ళం గదా అని మూడు మైళ్ళ దూరం నుంచి నడిచి వచ్చాడు!'' నిష్ఠూరంగా అంది.

''శాంతీ!'' చిన్నగా అరిచారు రావుగారు.

''ఏం? ఎందు కంత కోపం? ఉన్న మాటంటే ఉలుకెక్కువని?''

''అతను నీ కే మవుతాడని! అతనంటే అంత అభిమానం, ప్రేమా ఒలకపోస్తావు?''

అవాక్కయింది శాంతి.

* * *

రోజులు గడుస్తున్నాయి. రావుగారి ఇంటికి అప్పుడప్పుడు వెళుతూనే ఉన్నాడు మూర్తి.

''మాకు విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయింది, అన్నయ్యగారూ!'' అంది శాంతి.

మూర్తికి షాక్ తిన్నట్లయింది. కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు.

''వచ్చి ఏడాదయినా కాలేదు! అప్పుడే ట్రాన్స్‌ఫరా?'' అని మాత్రం అనగలిగాడు.

''అవునండీ! ఆంధ్రాకి ట్రాన్స్‌ఫరు కావాలని ఎన్నాళ్ళ నుండో ప్రయత్నం చేస్తున్నారు. అస్సాం నుండి ఆంధ్రాకే వేస్తా రనుకొన్నాం. ఇక్కడికి వేశారు. ఇప్పుడు ఆంధ్రాకి వేశారు.'' ఆనందంతో చెప్పుకుపోతూన్న ఆమెను చూసి, ''చాలా అదృష్టవంతులు!'' అనేశాడు పైకే.

ఇంతలో రావుగారు వచ్చారు ఆఫీసు నుండి.

''ఎవరూ? మూర్తిగారా?'' అంటూనే ప్రవేశించారు.

మూర్తి లేవబోయాడు.

''ఫరవాలేదు, కూర్చోండి! అయామ్ ట్రాన్స్‌ఫర్డ్ టు బెజ్వాడ!''

''అవునట! ఆ విషయం ఇప్పుడే తెలిసింది!''

''ఈ రోజే రిలీవ్ అయిపోయా! ఆరో తారీఖు సోమవారం మంచిది! ఆ వేళనే వెళ్ళాలనుకొంటున్నాం.''

''మీ కుటుంబంలో ఒక మనిషిగా మసిలాను! ఇంత వేగంగా వెళ్ళిపోతారనుకోలేదు!'' అన్నాడు రుద్ధస్వరంతో ఏమనాలో తెలియక.

''మాకూ అలావే అనిపిస్తోంది'' అన్నారు రావుగారు, బట్టలు మార్చుకొంటూ.

''మీరు నా కో హెల్ప్ చెయ్యాలి, మూర్తిగారూ!''

''మీకు సహాయం చేసే అవకాశం మరలా ఎప్పుడు లభిస్తుందో! తప్పకుండా చేస్తా. చెప్పండి, సార్!''

''టిక్కెట్లు, బెర్తు రిజర్వేషను విషయం మీరు చూసిపెట్టాలి, ఈ పరికి రిజర్వేషను అయిపోయే ఉంటాయి కాబట్టి!''

''నాకు తెలిసినవా డొకడున్నాడండి తెలుగు వాడే! మన వాళ్ళంటే ఎలాగో కిందా మీదా పెట్టి సహాయం చేస్తాడు. ఆ విషయం నా కొదిలేయండి. బెర్తులు రిజర్వు అయినట్లే లెక్క.'' భరోసా ఇచ్చాడు మూర్తి.

ఆనందంతో ఉప్పొంగిపోయారు రావుగారు.

''ఇక మే ముండేది వారం రోజులే కాబట్టి ఈ వారం రోజులూ మా ఇంట్లోనే ఉండాలి మీరు.''

రావుగారు ఆనందంగా, ఫ్రీగా మాట్లాడడం చూడని మూర్తి ఆశ్చర్యపోయాడు. శాంతి మొహం ఆనందంతో మెరిసింది. శాంతి మొహం చూసిన తరవాత ఏమీ మాట్లాడలేకపోయాడు మూర్తి.

రావుగారి కుటుంబానికి వీడ్కోలు ఇచ్చి, స్టేషనులోనే చాలాసేపు కూర్చుండిపోయాడు. కళ్ళ నీళ్ళు పెట్టుకొన్నాడు. తనవారందరూ నట్టడివిలో వదిలిపోయినట్లనిపించింది. ఏదో తెలియని ఆవేదన, ఆందోళన. బరువైన హృదయంతో క్వార్టరు చేరాడు, బాగా రాత్రి అయ్యాక.



నాతి

చిత్రం — ఎ. ప్రభాకర్ (జగిత్యాల)

తలుపు తీసి లైటు వేశాడు. గుమ్మం లోపలి వైపు రెండు కవర్లు పడిఉన్నాయి. తలుపు సందులోంచి పోస్టుమన్ పడేశాడు.

తమ్ముని దగ్గర నుండి వచ్చిన కవరు విప్పాడు ముందుగా.

రవికి జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఉద్యోగం అయింది. అరకు వేలీలో పోస్టింగ్ ఇచ్చారు. ఆ రోజే జాయిను అయి ఉత్తరం వ్రాశాడు. అదీ ఆ ఉత్తరంలోని సారాంశం! అక్కగారికీ, బావగారికీ ఆ విషయం తెలియజేయమన్నాడు. వారికి కూడా ఉత్తరం వ్రాశాడట! గోవిందన్నాయర్ గారిని స్వయంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేయమన్నాడు.

రెండో కవరు చూశాడు. రావుగారి ఆఫీసునుండే! విప్పి చూశాడు. రవికి పోస్టింగ్ ఆర్డర్సు! దిగువ రావుగారి సంతకం! ఆశ్చర్యపోయాడు 'మూర్తి, రావుగారు ఆ విషయం తనకేమీ చెప్పనందుకు! ఆ విషయం ప్రస్తావించడం ఇష్టంలేక తనూ అడగలేదు. అయితే, శాంతికి కూడా ఈ విషయం తెలిసి ఉండదు! ఆంధ్రుడు కదూ? ఆంతర్యం అంత సులువుగా అర్థం కాదు అనుకొన్నాడు. ఈ విషయం శంకరంతో వెంటనే చెప్పాలనుకొన్నాడు. ★